

రేపు కామారెడ్డిలో జాబ్‌మేళా

కామారెడ్డి టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని ఉపాధి శాఖ కార్యాలయంలో గురువారం కామారెడ్డి, హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీ ఎంఎస్‌సీ బ్యాంక్‌లో 30 రిలేషన్ షిప్ మేనేజర్ ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనాధికారి మల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 26 ఏళ్ల మధ్యలో ఉన్నవారు అర్హులు. జీతం రూ.20వేలు ఉంటుందన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 80968 57078, 76719 74009 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.



స్థానిక సంస్థల్లో..

బీసీలకే ఆధిపత్యం!

- మరింత కలిసి రానున్న బీసీ రిజర్వేషన్‌లు
- గత ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో 119 మంది బీసీ అభ్యర్థుల గెలుపు
- 42 శాతం రిజర్వేషన్ల దిశగా ప్రభుత్వం అడుగులు
- జిల్లాలో 536 సర్పంచ్ స్థానాలు
- 25 జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు
- 233 ఎంపీటీసీ స్థానాలు
- రిజర్వేషన్లపై కొనసాగుతున్న తర్జన భర్జన
- గ్రామాల్లో నెలకొంటున్న ఎన్నికల హడావిడి

కామారెడ్డి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తే జిల్లాలో బీసీలదే ఆధిపత్యం పెరుగుతుందని భావిస్తున్నారు. హామీని నిలబెట్టుకునే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఆర్డినెన్స్‌ను జారీ చేసి గవర్నర్, రాష్ట్రపతి, కేంద్రానికి నివేదించారు. వారి వద్ద నుంచి రిజర్వేషన్ల అమలు కోసం గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో కాంగ్రెస్ పోరుబాట పట్టింది. 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేసేందుకు కేంద్రంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల ఖరారుపై ఆసక్తి మొదలైంది. రిజర్వేషన్లపై దృష్టి సారించిన ఆశావహులు ఎన్నికల రంగంలోకి సిద్ధమవుతున్నారు. బీసీలో మాత్రం 42 శాతం రిజర్వేషన్లతో పాటు జనరల్ స్థానాల్లో కూడా బీసీలు ఉనికి చాటుకునే దిశగా సిద్ధమవుతున్నారు. జిల్లాలో గతంలో జరిగిన ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీలు అధిక సీట్లలో గెలుపొందారు. 119 మంది బీసీలు గతంలో జరిగిన పరిషత్, గ్రామ పంచాయతీల్లో జనరల్ స్థానాల్లో గెలుపొందారు. అదే సంప్రదాయం ఈసారి కూడా కొనసాగుతుందని భావిస్తున్నారు.

బీసీలకు కలిసి వస్తున్న అవకాశాలు

బీసీల జనాభా ఎక్కువగా ఉన్నా రాజకీయంగా వెనుకబడుతున్న నేపథ్యంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ తొలిసారిగా బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు అమలులోకి తెచ్చారు. ఆ రిజర్వేషన్‌లు బీసీలకు రాజకీయ చైతన్యంగా నాయకుల ఎదుగుదలకు తోడ్పడింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో 20 శాతం బీసీలకు రిజర్వేషన్‌లు కేటాయించారు. ఆ తర్వాత కూడా బీసీ సంఘాలు రిజర్వేషన్ల పెంపు కోసం పోరాటం చేయడంతో మరోసారి అప్పటి ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్‌లు 34 శాతానికి పెంచింది. సుప్రీంకోర్టు రిజర్వేషన్‌లను మొత్తం 50 శాతం దాట కూడదని పరిమితి విధించడంతో గత 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్‌లను 22 శాతానికి తగ్గించి ఎన్నికలు నిర్వహించింది. బీసీలకు అన్యాయం జరిగిన జనరల్ స్థానాల్లో సత్తా చాటారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 42 శాతం సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. దానికి అనుగుణంగానే బీసీ రిజర్వేషన్‌లను 42 శాతం అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది.

గత పంచాయతీ ఎన్నికల్లో బీసీలదే హవా

కామారెడ్డి కొత్త జిల్లాగా ఏర్పడినప్పుడు 526 గ్రామ పంచాయతీలు ఉండేవి. 2019లో ఎన్నికలు జరిగిన సమయంలో జిల్లాలో 526 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బీసీలకు 153 సర్పంచ్ స్థానాలు రిజర్వ్ అయ్యాయి. ఇక జనరల్ స్థానాల్లోనూ 96 మంది బీసీలు గెలుపొందారు. ఇలా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మొత్తం బీసీలు 249 మంది వరకు సర్పంచ్‌లుగా గెలుపొందారు. అదేవిధంగా 4,656 వార్డుల్లోనూ బీసీలు సత్తా చాటారు. ప్రస్తుతం కొన్ని గ్రామ పంచాయతీలు పెరగడంతో జిల్లాలో 536కు పంచాయతీల సంఖ్య చేరింది. అదేవిధంగా వార్డులు 4,656 ఉన్నాయి. వీటి పరిధిలో రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గత జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో 119 బీసీల గెలుపు

2019 పరిషత్ ఎన్నికల్లోనూ బీసీలు సత్తా చాటారు. ఈ ఎన్నికల్లో 22 జడ్పీటీసీ స్థానాల్లో ఎస్‌టీలకు రెండు, ఎస్‌సీలకు 4, బీసీలకు 5, జనరల్‌గా 6 రిజర్వ్ అయ్యాయి. ఇందులో జనరల్‌లో ఇద్దరు బీసీ జడ్పీటీసీలు గెలుపొందడంతో జిల్లా పరిషత్‌లో ఏడుగురు బీసీ జడ్పీటీసీలు సత్తా చాటారు. ఇక 236 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఇందులో ఎస్‌సీలకు 39, ఎస్‌టీలకు 21, బీసీలకు 63 జనరల్‌గా 113 స్థానాలు రిజర్వ్ అయ్యాయి. ఇందులోనూ జనరల్ స్థానాల్లో 49 మంది బీసీలు గెలుపొందారు. 236 ఎంపీటీసీ స్థానాల్లో 112 మంది బీసీలు కైవసం చేసుకున్నారు. ఇలా జడ్పీటీసీ, ఎంపీటీసీలలో కలుపుకొని బీసీలు 119 మంది గెలుపొందడం విశేషం. ఈసారి జడ్పీటీసీల స్థానాలు 25కు చేరాయి. ఎంపీటీసీ స్థానాలు 232కు కుదించారు. ప్రస్తుతం ఉన్న ఈ స్థానాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం ఎన్నికల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ సంబంధించిన ఏర్పాట్లు చేయడంతో పాటు సర్పంచ్

(మిగతా 8వ పేజీలో)



రక్తదాన శిబిరంలో పాల్గొన్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

రక్తదానం చేయడానికి
యువత ముందుకు రావాలి : కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అవసరమున్న వారికి ఆపదలో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని, యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా రక్తదాన విషయంలో రాష్ట్రంలోనే ముందుండాలని తెలిపారు. మన జిల్లాకే కాకుండా చుట్టుపక్కల జిల్లాలకు కూడా రక్తాన్ని అందిస్తున్నామని తెలిపారు. మన జిల్లాలోని జిల్లా అధికారులు, సిబ్బంది తప్పకుండా రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని ప్రతీ ప్రజావాణిలో సూచిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు రఘుకుమార్, దస్తీరాం, నరసింహం, రమేష్‌రెడ్డి, కాలేజీ అధ్యాపకులు శ్రీనివాస్‌రావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్‌పతి దీదీకి ముగ్గురు జిల్లావాసుల ఎంపిక



ఎంపికైన వారిని అభినందిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ద్వారా అమలు చేస్తున్న లక్‌పతి దీదీకి ముగ్గురు జిల్లావాసులు ఎంపికయ్యారని డీఆర్‌డీవో పీడీ సురేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లింగంపేట మండల అధ్యక్షురాలు గడ్డం సులోచన, కామారెడ్డి మండల అధ్యక్షురాలు గరిగే గోదావరి, బీర్కూర్ మండలం అధ్యక్షురాలు సవితలు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈనెల 15న ఢిల్లీలో జరిగే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లులు చెల్లించాలి

- నిర్మాణంలో చిన్న చిన్న లోపాలు ఉంటే సరిదిద్ది చెల్లించాలి
- హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి. గౌతంను కలిసిన ఎమ్మెల్యే



హౌసింగ్ కార్పొరేషన్ గౌతంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులకు బేస్మెంట్ లెవెల్ పూర్తి కాగానే బిల్లులను వెంట వెంటనే లబ్ధిదారులకు చెల్లించాలని మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ గౌతంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకం ప్రారంభానికి ముందు నిర్మించిన బేస్మెంట్ బిల్లులకు ఆమోదం ఇచ్చి బిల్లులు చెల్లించాలని చిన్న లోపాలు ఉంటే సరిదిద్దుతూ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని. తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు ఆలస్యం కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి కూడా నిధులు విడుదల చేయాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు కూడా సహకారం అందించాలని కోరారు. సానుకూలంగా స్పందించి నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న షబ్బీర్‌అలీ

కామారెడ్డి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన విఠల్‌రెడ్డి భార్య స్వరూప అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అందించినట్లు మాజీ ఎంపీటీసీ కుమార్‌గౌడ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలువగానే వెంటనే స్పందించి నిమ్స్ హాస్పిటల్ డాక్టర్‌తో మాట్లాడి విఠల్‌రెడ్డి భార్య స్వరూపకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం నుంచి చికిత్స నిమిత్తం ఆపరేషన్‌కు కావాల్సిన రూ.3లక్షల ఎల్‌వోసీని అందించినట్లు తెలిపారు. కుటుంబానికి ఆర్థిక సహాయం చేసినందుకు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో తక్కువ సంఖ్యలో..
నమోదవుతున్న ఆర్టీఐ ఫిర్యాదులు

- రాష్ట్ర సమాచారశాఖ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో సమాచారహక్కుచట్టంపై అవగాహన



మాట్లాడుతున్న రాష్ట్ర సమాచారశాఖ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తక్కువ సంఖ్యలో ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు నమోదవుతున్నాయని రాష్ట్ర సమాచారశాఖ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై జిల్లా అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్ట్‌ను కచ్చితంగా ప్రదర్శించాలని అన్నారు. ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువగా అందిన మూడు జిల్లాల్లో కామారెడ్డి జిల్లా ఒకటని తెలిపారు. కామారెడ్డి కొత్త జిల్లా కాబట్టి ఆర్టీఐ చట్టంపైన ప్రజలకు మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి పారదర్శకత, జవాబుదారితనంతో సమాచారాన్ని అందించాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న లక్ష పాత కేసులను ప్రత్యేక విచారణ ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారు అడిగిన విధంగా 30 రోజుల్లో పారదర్శకంగా కచ్చితమైన సమాచారాన్ని యథాతథంగా అందించాలని సూచించారు. సమాచారం ఇవ్వడానికి తిరస్కరిస్తే సరియైన కారణాన్ని చూపాలని తెలిపారు. రాష్ట్ర కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి మాట్లాడుతూ ఆర్‌టీఐ చట్టం ప్రజల అవసరాల కోసం ఉద్యమాల ఫలితంగా ఏర్పడిందని తెలిపారు. రెవెన్యూ, విద్యాశాఖ, ఎలక్ట్రిసిటీ, ఆడిట్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖలు తమ సందేహాలను అడుగగా రాష్ట్ర సమాచార కమిషనర్ మోహ్సినా పర్వీన్ నివృత్తి చేశారు. మరో కమిషనర్ దేశల భూపాల్ మాట్లాడుతూ ఆర్టీఐ చట్టం వచ్చి 20సంవత్సరాలు పూర్తవుతున్నా, కొందరు సిబ్బందికి ఇంకా పూర్తిస్థాయి అవగాహన లేదని, ప్రతి ఒక్కరూ చట్టంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్లు ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి బాధితుల గోడును విని పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మాట్లాడుతూ ఆర్టీఐ చట్టంపై ప్రతీ అధికారి పూర్తి అవగాహన పెంచుకోవాలని అన్నారు. జిల్లాలో పెండింగ్‌లో గల 220కి పైగా అప్పీల్ కేసులను కలెక్టరేట్‌లో రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషన్ ప్రత్యేకంగా హియరింగ్ నిర్వహించి పరిష్కరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత దేశ భవిష్యత్తును లక్ష్యంగా పెట్టుకోవాలి

అసిస్టెంట్ ప్రొఫెసర్ అంజయ్య

కామారెడ్డి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మన దేశ భవిష్యత్తును మెరుగు పరిచే విధంగా యువత లక్ష్యంగా పెట్టుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ అంజయ్య తెలిపారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్కె డిగ్రీ, పీజీ కళాశాలలో రోటరి క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చర్యలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, భవిష్యత్తు అనే 2025 థీమ్‌పై మోటివేషన్, ట్రైనింగ్ నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాల సాధనలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం. జైపాల్ రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ పున్నా రాజేష్, రోటరీ క్లబ్ ఆఫ్ అధ్యక్షుడు యాచం శంకర్, కార్యదర్శి సుధాకర్, సబ్బని కృష్ణహరి, వెంకటరమణ, ప్రిన్సిపాల్ గోవర్ధన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బాలు, ఏవో శ్రీధర్, లింగం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన
టీపీసీసీ ప్రధాన కార్యదర్శి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించినట్లు ఆయన తెలిపారు. కామారెడ్డిలో పార్టీ పరిస్థితిని సీఎం అడిగి తెలుసుకున్నారని తెలిపారు. ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పం దించారని వివరించారు.



కామారెడ్డిలో న్యాయవాదులకు హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న దృశ్యం

న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ

కామారెడ్డి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హెల్త్ కార్డులను పంపిణీ చేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులకు ఈ హెల్త్ కార్డులు చాలా ఉపయోగకరంగా ఉంటాయని, ఈ కార్డు ద్వారా రూ.2లక్షల వరకు కార్పోరేట్ హాస్పిటల్‌లలో చికిత్స పొందవచ్చని అన్నారు. అలాగే హెల్త్ కార్డులు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డి బార్ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది దేవరాజ్‌గౌడ్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బండారి సురేందర్‌రెడ్డి, అడిషనల్ పీపీ నిమ్మ దామోదర్‌రెడ్డి, అమృతరావు, దామోదర్‌రెడ్డి, గజ్జెల భిక్షపతి, లక్ష్మణ్‌రావు, ప్రదీప్‌రెడ్డి, జడల రజనికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా..

- కుంటలో పడి కవలల మృతి
- ఇద్దరు పిల్లలు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు



కుంటలో పడి మృతి చెందిన రామ్, లక్ష్మణ్ (ఇన్‌సెట్‌లో) ఫైల్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఈత సరదా తీర్చుకునేందుకు వెళ్లిన కవలలు కుంటలో మునిగి మృతి చెందిన సంఘటన కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లిలో చోటు చేసుకుంది. దేవునిపల్లి ఎస్ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం... తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన గుర్రాల పెద్ద నర్సింలు, మంజుల దంపతులకు రామ్(13), లక్ష్మణ్(13) అనే కవల పిల్లలు ఉన్నారు. తండ్రి మేస్త్రీ పని చేస్తుండగా, తల్లి బీడీలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రామ్, లక్ష్మణ్ తిమ్మక్‌పల్లి గ్రామంలోని జడ్పీహెచ్ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. సోమవారం సాయంత్రం స్కూల్ అయిపోగానే ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత ఈత కొట్టడానికని గ్రామశివారులో ఉన్న కుంట వద్దకు వెళ్లారు. కుంటలో దిగిన తర్వాత లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందారు. పిల్లలు పొద్దుపోయినా ఇంటికి రాకపోయేసరికి స్నేహితులతో ఆడుకుంటున్నారని తల్లిదండ్రులు భావించారు. రాత్రి 10 గంటలు దాటినా రాకపోయేసరికి గ్రామంలో వెతికారు. చివరికి గ్రామ శివారులో ఉన్న కుంట ఒడ్డుపై ఇద్దరి దుస్తులు కనిపించడంతో కుంటలో గాలించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని కుంటలో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున 4గంటలకు ఒక బాలుడి మృతదేహం లభించింది. మంగళవారం ఉదయం 7 గంటలకు మరో మృతదేహం లభ్యమైంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జనరల్ ఆస్పత్రికి తరలించారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఒకేసారి పుట్టిన పిల్లలు ఒకేసారి మృతిచెందడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కుంటలో దూకి మహిళను కాపాడిన పోలీసులు

- పోలీసులను అభినందించిన ఎస్పీ

వివరాలు 6లో..



కామారెడ్డిలో కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

సబ్సిడీపై కుట్టు మిషన్ల పంపిణీ

కామారెడ్డి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై 30 కుట్టు మిషన్లను పంపిణీ చేసినట్లు మంగళవారం గ్రామ స్వరాజ్య సంస్థ తెలంగాణ స్టేట్ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ వెంకటలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్వరాజ్య సంస్థ ద్వారా ఈ కుట్టు మిషన్ శిక్షణలో భాగంగా మహిళలు నైపుణ్యత పెంపొందించి ముందంజలో ఉండాలని తెలిపారు. గ్రామ స్వరాజ్యం ద్వారా బ్యూటీషన్, ఫ్యాషన్ డిజైనర్ శిక్షణ ఇవ్వడంతో పాటు జాబ్ ప్లేస్‌మెంట్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ పోలీస్ మాధవి, ట్రైనర్ మంజుల, జిల్లా టెక్నీషియన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా..

బిచ్కుంద, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన జుక్కల్ నియోజకవర్గం విద్యాభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వానికి నివేదికలు అందించి సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కావాల్సిన నిధులను తీసుకువస్తానని తెలిపారు. ప్రతిపక్షాల వారు ఎన్ని విమర్శలు చేసినా పట్టించుకోకుండా ఈ ప్రాంత అభివృద్ధి కోసం తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు గంగాధర్, నౌషనాయక్, నాగనాథ్‌పటేల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్

రెంజల్,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చినటువంటి భూభారతి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ సదస్సు ద్వారా వచ్చిన భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు. ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను పరిష్కరించేందుకు సదస్సు నిర్వహించిందన్నారు. భూభారతి సర్వేలలో ఇబ్బందులు ఉండడం వల్ల సమయం పడుతుందని ప్రజలు సహకరించాలని అన్నారు. వీలైనంత త్వరగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేసే విధంగా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూ,చించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అయేషా ఫాతిమా, ఆర్ఐ రాజు, జూనియర్ అసిస్టెంట్ గౌతం, సర్వేయర్ జాదవ్, రెవెన్యూ సిబ్బంది శంకర్, అభిషేక్, రజిని, ఫరీద్ తదితరులున్నారు.

ఈతమొక్కలను సంరక్షించుకొని ఉపాధిని పొందాలి



ఉప్లూర్‌శివారులో ఈత మొక్కలను నాటుతున్న ఎక్సైజ్ సీఐ,ఎస్సై

కమ్మర్‌పల్లి,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి):ప్రతీఏట నాటుతున్న ఈత మొక్కలను గీతాకార్మికులు బాధ్యతగా సంరక్షించుకుంటు వాటి ద్వారా ఉపాధిని పొందాలని మోర్తాడ్ ఎక్సైజ్ సీఐ గుండప్ప అన్నారు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉప్లూర్ గ్రామశివారులోని ప్రభుత్వ భూముల్లో మోర్తాడ్‌ఎక్సైజ్ ఎస్సై మానస, గ్రామ గీతాకార్మికులతో కలిసి మొదటి విడతగా వెయ్యి ఈతమొక్కలను నాటారు.కాగాస్థలాలనప్పి పరిశీలించిన అనంతరం రెండో విడతగా మరో వెయ్యి ఈతమొక్కలునాటే ఈకార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మోర్తాడ్‌ఎక్సైజ్ సిబ్బంది,గ్రామగౌడ సంఘం సభ్యులు ఉట్నూర్ రవిగౌడ్, హన్మాండ్లుగౌడ్, సత్యాగౌడ్, సదాశివ్‌గౌడ్,మాసంమధుగౌడ్,ఈజీఎస్‌అసిస్టెంట్ ఫీల్డ్అసిస్టెంట్‌శివా,ఉపాధిహామీకూలీలు,గౌడకుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

కుంటలో దూకి మహిళను కాపాడిన పోలీసులు



ఎస్సైకి క్యాష్‌రివార్డు అందిస్తున్న ఎస్పీ

కామారెడ్డిటౌన్,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో సమీపంలో కుంటలో దూకి ఆత్మహత్యయత్నంచేసిన మహిళను దేవునిపల్లి పోలీసులు రక్షించారు. కుటుంబకలహాల కారణంగా తీవ్ర మనోవేదనకు గురైన ఓ మహిళ కాలనీ సమీపంలోని కుంటలో దూకి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే అక్కడికి చేరుకున్న దేవునిపల్లి ఎస్ఐ-2 భువనేశ్వర్,కానిస్టేబుల్ బాలకృష్ణలు నీటిలో అపస్మారక స్థితిలో ఉన్న మహిళను బయటకు తీసిప్రాథమిక చికిత్సలో బాగంగా కడుపులోంచి నీటిని తీసి ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. ఒక మహిళ ప్రాణాల ను కాపాడినఎస్సై,కానిస్టేబుల్‌లను ఎస్పీ అభినందించి క్యాష్ రివార్డు అందించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు

కామారెడ్డిటౌన్,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చేపట్టిన డ్రంక్ డ్రైవ్‌లో దొరికిన ఒకరికి రెండురోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు. క్యాసంపల్లి గ్రామానికి చెందిన నిఖిల్ మద్యం సేవించి వాహనాన్ని నడిపాడని అతనికిపరీక్షలు నిర్వహించగా మోతాదుకు మించి త్రాగి వాహనం నడిపాడనిగుర్తించి కోర్టులో ప్రవేశపెట్టామని తెలిపారు.దీంతో న్యాయమూర్తి చంద్రశేఖర్ ఆయనకు శిక్షను వేశారని తెలిపారు.

..ఒకరికి రెండురోజులు జైలు శిక్ష

భిక్కనూరు,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):భిక్కనూరు పోలీసుస్టేషన్ పరిధిలో టోల్‌ప్లాజా సమీపంలో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన మెదక్ జిల్లాచేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన చాకలి నరేందర్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు కామారెడ్డి రెండో క్లాస్ జుడిషియల్ మెజిస్ట్రేట్ చంద్రశేఖర్ మంగళవారం విధించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపిన, మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

.. వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష

నవీపేట,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మండలంలోని మహంతంకు చెందిన కుర్మ రాజన్న పట్టుబడగా అతనిని మంగళవారం కోర్టులో హాజరుపర్చడం జరిగిందని ఎస్ఐ వినయ్ తెలిపారు. సంబంధిత వ్యక్తికి స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం రెండు రోజుల జైలుశిక్ష విధించారని ఎస్ఐ పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ పేర్కొన్నారు.

.. వ్యక్తికి నాలుగు రోజుల జైలు

ఏర్గట్ల,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని బట్టాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ సబ్బీర్ (34) మద్యం తాగి వాహనం నడిపి నందుకు గాను ఆర్మూర్ సెకండ్ క్లాస్ న్యాయాధికారి గట్టు గంగాధర్ సదరు వ్యక్తి సయ్యద్ సబ్బీర్‌కి మంగళవారం నాలుగు రోజుల సాధారణ జైలు శిక్షను విధించినట్లు ఏర్గట్ల ఎస్సై పడాల రాజేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భవానిపేట్ మాజీ సర్పంచ్ మృతి

బోధన్,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం భవానిపేట్ మాజీ సర్పంచ్ పల్లెంపాటి కృష్ణకాంత్ మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి తీరని లోటని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. నిత్యం ప్రజలతో అందుబాటులో ఉండి సర్పంచ్ పదవీకాలంలో గ్రామానికి ఏనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుందన్నారు.

న్యాయవాదులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

● అవగాహన సదస్సులో జిల్లా న్యాయాధికారి జీవీఎస్ భారత లక్ష్మీ



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి భరతలక్ష్మీ

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులు, న్యాయవాదుల వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడానికి సీనియర్ న్యాయవాదుల ప్రసంగాలు, ఆలోచన ధారఉపయోగపడతాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి ,న్యాయ సేవ సంస్థ చైర్‌పర్సన్ జీవీఎస్ భారతలక్ష్మీ తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్‌లో నిర్వహించిన చట్టాలపై మూడురోజుల అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. కొత్త,పాతచట్టాలు ప్రజలదరికి చేరే విధంగా పారా లీగల్ వాలంటీర్లు కృషిచేయాలని కోరారు. న్యాయవా దుల వృత్తి జీవనంలో చట్టాల అధ్యయనమే కీలకమని, కోర్టులు వెలువరించే తీరులో చట్టాల అన్వయం ఎలా ఉంటుందనేది చదివి విజ్ఞాన వంతులు కావాలని ఆమె ఆశించారు. అనంతరం సీనియర్ న్యాయవాది జివికృపాకర్‌రెడ్డి ప్రసంగిస్తూ ఒకక్రిమినల్ కేసులో ప్రతీ అంశాలను చదవాలని అన్నారు.నేరం జరిగిన వెంటనే నమోదు అయిన ప్రాథమిక సమాచార నివేదికలోని వివరాలు, ఫిర్యాదుదారుల స్టేట్‌మెంట్,ప్రత్యక్ష సాక్షులవాగ్మూలాలు, నేరస్థల పంచానామా, ముద్దాయిల నేర అంగీకారం క్షుణంగా చదవాలని సూచించారు. నేర విచారణ జరిపిన అనంతరం పోలీసు అధికారులు కోర్టుకు సమర్పించే అభియోగ పత్రంలోని అంశాలు ప్రతి విషయం, ప్రతి పదం న్యాయవాదుల వృత్తికి ప్రమాణికమేనని తెలిపారు. క్రిమినల్ కేసులలో ప్రాథమిక అంశాలు కీలకమనే విషయాలు మరువొద్దని అన్నారు.క్రిమినల్ కేసులలో ఉన్న అక్షరాలను వంట బట్టిచ్చుకుని న్యాయవాదుల వృత్తి ప్రస్థానం కొనసాగించుకోవాలని జివికృపాకర్‌రెడ్డి కోరారు. కేసులోని పదాల అణువులను కోర్టుల విచారణ సమయంలో మదిలో నిలుపుకుని క్రాస్ ఎగ్జామ్ చేయాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఒకమంచి కార్యక్రమానికి శ్రీకారంచుట్టిన న్యాయ సేవ సంస్థ మరిన్ని భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించాలని ఆశించారు. జాతీయ న్యాయసేవ ప్రాధికార సంస్థ నాల్సా లక్ష్యం మేరకు న్యాయ విజ్ఞాన సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయసేవఅధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఉదయ్ భాస్కర్‌రావు తెలిపారు.కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేదార్, బార్ ఉపాధ్యక్షుడు దిలీప్, న్యాయవాదులు పాల్గొన్నారు

తెలంగాణలో టీడీపీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● ఏపీ సీఎంతో మాజీ ఉమ్మడి రాష్ట్రాల హస్త కళల చైర్మన్ అమర్‌నాథ్ బాబు



మాట్లాడుతున్న అమర్‌నాథ్‌బాబు

బోధన్,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీ పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడితో మాజీ హస్త కళల చైర్మన్, పెంటాఖుర్దు సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్ బాబు పేర్కొన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అమరావతి సెక్రెటేరియట్‌లో బోధన్ మండలం పెంటాఖుర్దు సహకార సంఘం సొసైటీ చైర్మన్, మాజీ ఉమ్మడి రాష్ట్రాల హస్త కళల చైర్మన్ అమర్‌నాథ్ బాబు కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజకీయ అంశాలపై చర్చించారని ఆయన తెలిపారు. తెలంగాణలో టీడీపీ పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి రాష్ట్రస్థాయి కమిటీలు వేయాలని రాజకీయ అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఇద్దరి మధ్య తెలంగాణలోని రాజకీయ అంశాలపై చర్చ జరిగిందని తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో పూర్తిస్థాయిలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని, తెలంగాణలో రాష్ట్రస్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఈ సందర్భంగా ఆయన మాట్లాడినట్లు అమర్‌నాథ్ బాబు వివరించారు.

బహుళ జాతీ కంపెనీలు భారతదేశాన్ని వీడాలి

మాక్లూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారత దేశ ఆర్థిక సంపదను దోపిడి చేస్తు వ్యవసాయ రంగాన్ని పట్టి పీడిస్తున్న బహుళ జాతీ సంస్థలు భారత దేశాన్ని వీడాలని కిసాన్ సంయుక్త మోర్చ ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ దేశెట్టి సాయిరెడ్డి అన్నారు. బుధవారం జరిగే నిరసన ప్రదర్శనలో రైతులు అధికంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగుడిపై దాడికి నిరసనగా ధర్నా

కోటగిరి,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగుడిపై దాడిని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోచీరాం మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వికలాంగుడిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు గొల్ల శ్రీనివాస్ యాదవ్, శివకుమార్, సాయిలు, రాజు, గోపి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కోటగిరి,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని వినాయక్‌నగర్ కాలనీలో సకట విమోచన గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రముఖ వేద పండితులు రాజు మహరాజ్ ఆధ్వర్యంలో యజ్ఞం, హోమం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, విండో అధ్యక్షులు కూచి సిద్దు, హన్మాండ్లు, అనంత్, అబ్బయ్య, గంగారాం, కోల అశ్విన్‌సెట్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ వినోద్

జక్రాన్‌పల్లి/ఏర్గట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న గణేష్ ఉత్సవాలను గణేష్ మండపాల సభ్యులు,భక్తులు, ప్రజలుశాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డిచ్‌పల్లి సీఐ వినోద్,ఏర్గట్ల ఎస్సై పడాల రాజే శ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు.మంగళవారం జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటిని నిర్వహించారు.అనంతరం జరిగిన సమావేశం లో సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఈ నెల 27న వినాయక చవితి పండుగ సందర్భంగామండ పాల్లోగణేష్‌ను ప్రతిష్ఠాపించే మండపాల సభ్యులు పోలీస్ స్టేషన్‌లో మండపాల వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదన్నారు.మండపాల వద్ద డీజేలుపెడితే చర్య లు తీసుకుంటామన్నారు.ఈసమావేశంలోతహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎస్సై ఎండి మాలిక్ రహ్మాన్, వివిధ గ్రామాల గణేష్ మండ పాల సభ్యులు, శాంతి కమిటి సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన వృద్ధ మహిళలు, దివ్యాంగులు, కిషోర బాలికలను సంఘాలలో చేర్పించాలి

నవీపేట,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా అర్హులైన మహిళలతో పాటు వృద్ధ మహిళలు, దివ్యాంగులు, కిషోర బాలికలను స్వయం సహాయక సంఘాలలో చేర్పించాలని ఐకేపీడీపీఎం నీలిమా కోరారు. మంగళవారం మండల ఐకేపీ కార్యాలయంలో జరిగిన మహిళ సంఘాల సభ్యుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సంబంధిత సభ్యులతో సంఘాలుగా ఏర్పాటు చేయడానికి ఈ నెల 12నుంచి 30వ తేది వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మహేష్ కుమార్, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, ఉషారాణి, ఐకేపీ సీసీలు, వీవోఏలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హత్యకేసులో ఒకరికి జీవితఖైదు

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):గుడి పూజారిని హత్య చేసిన దు బ్బాక లక్ష్మణ్‌కు జీవిత కారాగార శిక్ష విధిస్తూ జిల్లా రెండో అదనపు సెషన్స్ న్యాయాధికారి శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెలువరించారు. పిపి బంటు వసంత్ తెలిపిన వివరాల మేరకు జిల్లాలోని సారంగాపూర్ గ్రామానికి చెందిన దుబ్బాక లక్ష్మణ్, ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ గ్రామ నివాసుడైన నర్రా ఎల్లయ్య స్నేహితులు. గతంలో వీరు పలు దొంగతనాలు చేసి జైలు జీవితం గడిపారు. ఇద్దరికి జైలులోనే పరిచ యం కలిగి స్నేహంగా మారింది. జైలు నుంచి బెయిలుపై విడులైన అనంతరం వీరి తీరు మార్చుకోకుండా ఎప్పటి లాగే దొంగతనాలు, మర్డర్లకు అలవాటు పడ్డారు. 30 ఏప్రిల్, 2017న లక్ష్మణ్ మరియు నర్రాఎల్లయ్య ఆటోలో ఇద్దరు కలిసి దొంగతనాలు చేయ డానికి బయలుదేరారు. అర్ధ రాత్రి చిన్నపూర్ అటవీ ప్రాంతానికి చేరుకున్న వీరు అక్కడ నిర్మాణంలో ఉన్న శ్రీరామ దేవాలయం దగ్గర గుడి పూజారి మేర నారాయణ గిరి స్వామి తన గుడిసెలో నిద్రపోతున్న సమయంలో లక్ష్మణ్ పెద్ద బండరాయితో అతని తలపై బలంగా వేయగా ఎల్లయ్య కట్టెతో కొట్టి తీవ్రంగా గాయపరచాడు. ఇద్దరి నేర చర్యలకు గాయల పాలైన పూజారి అక్కడే మృతి చెందాడనే నేరారోపణలు కోర్టు నేర న్యాయ విచారణలో నిరూపితం అయినట్లు నిర్ధారిస్తూ ప్రధాన ముద్దాయి లక్ష్మణ్‌కు హత్య కేసులో జీవితఖైదు,పూజారి డబ్బులు,సెల్‌ఫోన్ దొంగలించినందుకు గాను మూడు సంవత్సరాల కఠిన జైలుశిక్ష విధించారు.కేసుకోర్టు విచారణలో ఉండగా రెండో ముద్దాయి ఎల్లయ్య మరణించినందున తనపై కేసును తొలగించారు.

ఆకట్టుకున్న కవ్వాలి

బోధన్,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): జలాల్ బుకారి దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రైస్ అనీస్ సాబ్రి కవ్వాలి అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కవ్వాలి కళాకారుడు రైస్ అనీస్ సాబ్రి కవ్వాలి చూడడానికి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి 11గంటలకు ప్రారంభమైన కవ్వాలి తెల్లవారుజాము వరకు కొనసాగింది. సీపీ సాయి చైతన్య భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఆయన వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు వెంకట నారాయణ, విజయ్ బాబు, ఉర్సు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న డబ్బుల రికవరీ

కోటగిరి,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్‌లో పోగొట్టుకున్న డబ్బులను రికవరీ చేసినట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. మండలంలోని సుద్దులం తండా గ్రామానికి చెందిన యోగేష్ అనే వ్యక్తి ఈ ఏడాది మార్చి 12వ తేదీన తన సెల్‌ఫోన్‌లో అనుమానాస్పద లింక్ మెసెజ్‌ను ఓపెన్ చేశాడు. లింక్‌ను ఓపెన్ చేయడంతో అతని బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులు ఇతర ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. ఈ విషయమై యోగేష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా అతని డబ్బులు రూ.2,112లను రికవరీ చేయించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అనుమానాస్పద లింక్‌లు ఓపెన్ చేయవద్దని, కొత్త నెంబర్ నుంచివచ్చే అనుమానాస్పద అప్లికేషన్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవద్దని సూచించారు. డబ్బులు పోగొట్టుకున్నట్లయితే వెంటనే 1930కి కాల్ చేయడం లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

నవీపేటలో ఏటీఎం చోరీకి విఫలయత్నం

● నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు





చోరీ యత్నానికి గురైన ఏటీఎం

నవీపేట,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాంపూర్ రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి చోరీకి విఫలయత్నం జరిగింది. ఎస్ఐ వినయ్, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రెంజల్ మండలం కూనేపల్లికి చెందిన సుద్దపల్లి నరేష్ అనే నిందితుడు అర్ధరాత్రి దాటిన తర్వాత రాంపూర్ రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలోకి చొరబడ్డాడు. ఏటీఎం మిషన్ కింది భాగాన్ని స్క్రూ డ్రైవర్‌తో తొలగించడానికి ప్రయత్నం చేయగా అది స్వల్పంగా ధ్వంసమైంది. ఈ సమయంలో ఏటీఎంలో ఉన్న నగదు భద్రంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. ఏటీఎం చోరీ యత్నం జరిగే సమయంలో ముంబాయిలో బ్యాంకు కేంద్ర కార్యాలయంలో అలారం మోగడంతో వారు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నవీపేట పెట్రోలింగ్ సిబ్బంది ఏటీఎంలో ఉన్న నిందితుడికి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై విచారణ జరుగుతుందని ఎస్ఐ పేర్కొన్నారు. రాంపూర్‌లో రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో చోరీ యత్నం జరగడం ఇది రెండవ సారి. గతంలో ఒకసారి ఇటువంటి ప్రయత్నం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

నవీపేట,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మహిళలరక్షణ కోసం షీటీమ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

6.5 కేజీల ఎండు గంజాయి స్వాధీనం

● ఒకరి అరెస్టు

సుభాష్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):మహారాష్ట్ర రాష్ట్రంలోని బోకర్ తాలూకా నుంచి జిల్లాకు ఎండు గంజాయిని సరఫరా చేస్తున్న షేర్ మిరాజ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 6.5 కిలోల ఎండుగంజాయి, బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్ తెలిపారు. మంగళవారం ఉదయం సుమారు 10గంటల ప్రాంతంలో ఖిల్లారోడ్‌లో తనిఖీలు నిర్వహించగా అనుమానం వచ్చి తనిఖీలు నిర్వహించగా షేక్ మిరాజ్ వద్ద 6.5 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. షేక్ మిరాజ్ మహారాష్ట్రలోని బోకర్‌కు చెందిన ఫారూఖ్ ఖురేషి నుంచి నిజామాబాద్ నగరంలోకి తెచ్చి అమ్మకాలు చేస్తున్నట్లు తెలిపారు. ఫారుఖ్ ఖురేషి పరారీలో ఉన్నట్లు సీఐవెంకటేశ్ తెలిపారు.ఈతనిఖీల్లో ఎస్సైనర్సింహాచారి, రాము,సిబ్బంది నారాయణరెడ్డి, విష్ణు, భూమన్న, అవినాష్, భోజన్న, ఉత్తమ్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల మండల గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఏర్గట్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా గౌడ యువసేన ఆధ్వర్యంలోమంగళవారం గౌడసంఘం నూతన మం డల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పులి శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా రంజిత్‌గౌడ్, ఎంగిలి పవన్ గౌడ్, ప్రధానకార్యదర్శిగా సంపత్ గౌడ్, సంయుక్త కార్య దర్శిగా లింగాల సత్య నారాయణ గౌడ్, కార్యనిర్వహణ కార్యదర్శిగా పాకాల స్నేహిత్ గౌడ్, అధికార ప్రతినిధిగా వేముల శంకర్ గౌడ్‌లను ఎన్నిక కాగా సలహాదారులుగా కోల రమేష్ గౌడ్, లింగా ప్రభాకర్ గౌడ్, కైరి దయానంద్ గౌడ్, మోత్కూరి కిషన్‌గౌడ్, తుపాకుల నారాయణ గౌడ్, హరీష్ గౌడ్‌లను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ సంఘాల సభ్యుల సమస్యల పరిష్కారం అభివృద్ధికోసం కృషి చేస్తామని తెలిపారు.

కుటుంబ ప్రయోజన పథకానికి దరఖాస్తులు

కోటగిరి,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): కోటగిరి, పొతంగల్ మండలాల్లో అర్హులైన నిరుపేద కుటుంబాలు జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెటర్నరీ, మండల ప్రత్యేక అధికారి రోహిత్‌రెడ్డి సూచించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబాన్ని పోషించే ప్రధాన సంపాదకుడు చనిపోతే బాధిత కుటుంబానికి ఈ పథకం కింద రూ.20వేల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. అర్హులైన వారు మీసేవాలో దరఖాస్తు చేసుకుని దరఖాస్తు పత్రాలను మండల తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ పథకం కింద 18 నుంచి 60ఏళ్ల మధ్య వారై ఉండి కుటుంబాన్ని పోషిస్తున్న వారు మరణిస్తే ఈ ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల ప్రత్యేక అధికారి అలీం హైమద్, ఎంపీడీవోలు శ్రీనివాస్‌రెడ్డి, చందర్, తహసీల్దార్ గంగాధర్ తదితరులున్నారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి

పెద్దకొడప్‌గల్,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని వడ్లం గ్రామ శివారులో పేకాట కేంద్రంపై దాడి చేసి 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.గ్రామశివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు కేంద్రంపై దాడి చేసి 10మందిపై కేసు నమోదు చేయడంతో పాటు రూ.14430 స్వాధీనం చేసుకున్నామన్నారు.దీంతో పాటుగానే 1 కారు, 9 ఫోన్లు, 5 మోటార్ సైకిళ్లను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. మండలంలో ఎవరూ పేకాట ఆడిన ఉపేక్షించేది లేదని, వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పేకాట వ్యసనంలో అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని, పేకాటను ఉపేక్షించేదిలేదన్నారు. ఇంక గ్రామాలలో ఎవరైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే ఆటువంటి వారి గురించి తమకు 87126 86179 నెంబర్‌కు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్టు చేయడం సరికాదు

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్

బోధన్,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావును అరెస్టు చేయడం సరికాదని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన బోధన్‌లో మాట్లాడుతూ బంజారాహిల్స్ పెద్దమ్మ గుడిలో కుంకుమార్చన పూజలో పాల్గొనడానికి వెళ్తున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రాంచందర్‌రావును పోలీసులు హౌజ్ అరెస్ట్ చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బంజారాహిల్స్ గుడిని కూల్చడమే కాకుండా పూజలను అడ్డుకోవడం హేయమైన చర్య అన్నారు.ఇకనైన హిందువులకు ప్రభుత్వం బేషరత్తుగా క్షమాపణ చెప్పాలన్నారు. లేనియెడల బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

వర్ని, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలం జాకోర గ్రామంలో బుధవారం గుడ్ల సైదయ్య అకాల మరణం చెందారు విషయం తెలుసుకున్న బాన్సువాడ నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి జాకోర గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. సైదయ్యా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.విండో చైర్మన్ దశరథ్ తమవంతు సహకారంగా రూ. ఐదు వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్‌గౌడ్, దత్తుగౌడ్, కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవీపేట,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీలో మంగళవారం బాధిత కుటుంబానికి మీకోసం మేము సేవా సంస్థ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన గుంజల పోసాని అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు సంస్థ సభ్యులకు 8వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమర్తి మోహన్, సుంకరి మహిపాల్, నరేందర్ తదితరులున్నారు.

రైతులు తమ పంట పొలాలకు సరిపడా ఎరువుల వాడాలి



ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ముప్కాల్,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి):రైతులు ఆనకాలం పంటలో అధికఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గుతుందని తమ పంట పొలాలకు సరిపడే ఎరువులు తక్కువ మోతాదులో వాడాలని జిల్లా వ్యవసా యాధి కారి మేకల గోవింద్ మంగళవారం సూచించా రు. ముప్కాల్ మండలంలోని వేంపల్లి, రెంజర్ల సొసైటీ పరిధిలోని గోదాంలను ఆయన తనికీ చేశారు. అదే విధంగా ఎరువుల వ్యాపారులను రైతులకు సరిపడా ఈపాక్ మిషన్ ద్వారానే ఎరువులను విక్రయించాలని సూచించారు. అనంతరం రెంజర్ల రైతు వేదికలో రైతుబీమా ధరఖాస్తులను పరిశీలించారు. ప్రతీ ఒక్క రైతుకు రైతుబీమా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సాయికృష్ణ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ కుటుంబ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీడీవో శంకర్

ఎడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కటుంబ పెద్ద, కుటుంబంలో ఆర్థిక సంపాదకుడు మరణించినట్లైతే ఆ కటుంబానికి ప్రభుత్వం ద్వారా 20వేల ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని ఎంపీడీఓ శంకర్ అన్నారు. దరఖాస్తు చేసుకున్న పత్రాలను సంబంధిత తహసీల్దార్ కార్యాలంలో అందించి ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని ఎంపీడీఓ కోరారు.

మంజూరీ పత్రాల అందజేత



విధుల మంజూరీ పత్రాన్ని ఎంఈవోకు అందిస్తున్న నాయకులు

కమ్మర్‌పల్లి,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌట్‌పల్లి ఉన్నత పాఠశాల, మండలపరిషత్ ప్రామికోన్నత బాలికల పాఠశాల్లో విద్యార్థులు సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణల నిమిత్తం బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు మల్లికార్జున్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎంపీల్యాడ్ నుంచి ఒక్కో పాఠశాలకు రూ.రెండు లక్షల చొప్పున రూ.4 లక్షల మంజూరి ఇచ్చినట్లు మండల పార్టీ అధ్యక్షుడు బద్దం రమేష్‌రెడ్డి తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కమిటీల సభ్యులు బీజేపీ మండల నాయకులు సున్నం మోహన్, కొత్తపల్లి గణేష్, దేవేందర్, కుంట రమేష్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు సతీష్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి మహేష్ పాల్గొన్నారు.


తాళ్లరాంపూర్‌లో వీడీసీ రద్దు



మాట్లాడుతున్న ఎస్సై రాజేశ్వర్

ఏర్గట్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలో విడీసి రద్దు చేస్తున్నట్లు గ్రామస్తులు మంగళవారం ఏర్గట్ల ఎస్సై పడాల రాజేశ్వర్ ఎదుట తెలిపారు. తాళ్లరాంపూర్ సొసైటీ ఫంక్షన్ హాల్‌లో గ్రామస్థులంతా ఏకమై ఏర్పాటు చేసుకున్న సమావేశంలో గత కొంత కాలంగా గౌడ సంఘానికి గ్రామాభివృద్ధి కమిటీకి జరుగుతున్న వివాదాల దృష్ట్యా జిల్లా న్యాయ సేవా సంస్థ సూచనల మేరకు గ్రామాభివృద్ధి కమిటీ గ్రామస్థులు పోలీసుల సమక్షంలో గ్రామ కమిటీ రద్దు చేసుకున్నట్లు తెలిపారు.

కార్మికులకు 26 రోజులు పనిదినం కల్పించాలి



ధర్నా నిర్వహిస్తున్న బీడీ కార్మికులు

ముప్కాల్,ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కిసాన్ నగర్‌లోని శివాజీ బీడీ కంపనిలోని పని చేస్తున్న బీడీ కార్మికులకు 26 రోజులు పని దినం కల్పించాలంటు మంగళవారం వినతి పత్రం అందజేశారు. బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్‌లో ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి శివాజీ కంపెనీలో వినతి పత్రం అందజేశారు. గత కొన్నిరోజులుగా 9నుంచి 10రోజులు మాత్రమే పనిదినాలు కల్పిస్తున్నారని దీని ద్వారా కార్మికుల జీవనభృతి ఇబ్బందిగా మా రుతుందని, కనీసం 26 రోజులు పని దినం కల్పించాలని వేడుకున్నారు. ఈ కార్యక్ర మం లో బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్నఏరియా నాయకులు నాజీర్, నిమ్మల నిఖిల్, కృష్ణవేణి, లావణ్య, పాల్గొన్నారు.



సింగూరు ప్రాజెక్టులో 21.799 టీఎంసీలకు చేరిన నీటి నిల్వలు

సింగూరు, నిజాంసాగర్‌లోకి భారీగా వరద

- ప్రాజెక్టుల్లో పెరుగుతున్న నీటి సామర్థ్యం
- సింగూరుకు 4,058, నిజాంసాగర్‌కు 5184 క్యూసెక్కుల వరద రాక

నిజాంసాగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టుల్లోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. సింగూరు ప్రాంతాల నుంచి 4058 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో ప్రాజెక్టులో 29.917 టీఎంసీలకు గాను 21.799 టీఎంసీలకు చేరుకుంది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 5184 వరద నీరు వస్తోంది. నిజాంసాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అయిన సింగూరు ప్రాజెక్టు నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి వరద రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

డ్రోన్‌లపై పెరుగుతున్న ఆసక్తి

- సులువుగా పురుగుల మందు పిచికారీ
- కూలీల కొరతను అధిగమిస్తున్న రైతులు
- తక్కువ సమయంలో ఎక్కువ స్ప్రే చేస్తున్న డ్రోన్లు

డొంకేశ్వర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పాత పద్ధతులను పాటిస్తూనే వ్యవసాయంలో కొత్తగా వచ్చిన పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతకాలంలో యంత్రాల వినియోగం పెరిగింది. రైతులు సాగుచేస్తున్న పంటలకు చీడపీడల నివారణ కోసం మందులను పిచికారీ చేయడం కోసం డ్రోన్‌లను వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారు. డొంకేశ్వర్ మండలంతోపాటు పలు గ్రామాల్లో రైతులు వరి, మక్క, సోయా పంటలకు డ్రోన్‌ల ద్వారా మందులు పిచికారీ చేయడం వల్ల మంచి ఫలితాలు రావడంతో రైతులంతా డ్రోన్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు.



డ్రోన్ స్ప్రేలో మందు నింపుతున్న రైతు

కానరాని హ్యాండ్ పంపులు

గతంలో రైతులు సాగు చేసిన పంటలపై పురుగు మందులు పిచికారీ చేయాలంటే హ్యాండ్ పంపులను వాడేవారు. కాలానుగుణంగా ప్రస్తుతం చార్జింగ్ పంపులు, పెట్రోల్‌పంపులు, బ్యాటరీ స్ప్రేయర్‌లను వినియోగిస్తున్నారు. వీటితో మందులు పిచికారీ చేయాలంటే కనీసం ముగ్గురు కూలీలు తప్పనిసరి ఉంటుంది. ప్రస్తుతం గ్రామాల్లో కూలీల కొరత అధికంగా ఉండడంతో పంటలు సాగుచేస్తున్న రైతులు సరైనా సమయానికి మందులు పిచికారీ చేయకపోతే పంటలకు చీడ, పీడలు పెరిగిపోయి పిచికారీ చేయకపోతే నష్టపోవాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతో కూలీల కొరతను అధిక మించడానికి ప్రస్తుతం డొంకేశ్వర్ మండలంలోని రైతులు డ్రోన్‌లతో పురుగు మందులను స్ప్రే చేయడం ఈజీగా అవుతుందని అంటున్నారు. గత నాలుగేళ్లుగా గ్రామాల్లో రైతులు నెమ్మదిగా ఉపయోగించడం మొదలుపెట్టారు. క్రమంగా కొందరు రైతులు నేరుగా డ్రోన్ స్ప్రేయర్‌ను సొంతంగా కొనుక్కున్నారు. ఇఫ్కో కంపెనీవారు నానో యూరియా బాటిల్ వాడుతూ రైతులు తెచ్చిన పురుగు మందులను నానో యూనియాను కలిపి తక్కువ ధరకే పంటలకు పిచికారీ చేస్తున్నారు. దీన్ని ఉపయోగించడం ద్వారా ఖర్చు తగ్గడంతోపాటు సమయం తక్కువ అవుతుందని రైతులు చెప్తున్నారు.

డ్రోన్‌తో తక్కువ సమయంలో ఎక్కువ పిచికారీ

డ్రోన్ స్ప్రేయర్ ఉపయోగించడంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలపై పురుగు మందులు పిచికారీ చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతోంది. డ్రోన్ స్ప్రేయర్‌కు కెమెరా అమర్చి ఉండి బ్యాటరీతో నడుస్తుంది. రిమోట్ కంట్రోల్ ఆదారంగా దీనిని ఉపయోగిస్తూ కేవలం 10 నిమిషాల్లో ఎకరాం పంటపై పురుగుమందు పిచికారీ చేయవచ్చు. పది లీటర్ ట్యాంక్ ఉంటుంది. బ్యాటరీతో కలిపి స్ప్రెయర్ బరువు 13 కిలోల బరువు ఉంటుంది. ప్రతీ ఎకరాం పొలంలో పిచికారి అనంతరం బ్యార్టీ మార్చుకోవాల్సి ఉంటుంది. కెమెరా ఆధారంగా పిచికారి ఒకే స్థాయిలో మందును పిచికారీ చేసే అవకాశం ఉంది. ప్రభుత్వం డ్రోన్ స్ప్రేలను సబ్సిడీలపై అందించాలని రైతులు కోరుతున్నారు.

డ్రోన్‌తో పిచికారీ చేయడం బాగుంది

● నాగస్వామి, రైతు, డొంకేశ్వర్



వరి, మక్క పంటకు డ్రోన్‌తో పురుగు మందును కలిపి పిచికారీ చేయించాను. కూలీలు కొరత ఉండడంతో డ్రోన్ స్ప్రేతో పిచికారీ చేయించాను. కూలీలతో స్ప్రే చేయడం వల్ల పంటకు ఒక్కో చోట ఎక్కువమందు పడే అవకాశం ఉంది. డ్రోన్‌తో స్ప్రే చేయడం వల్ల మందు ఒకే స్థాయిలో పంటకు అందుతుంది. సమయం ఆదాతో మంచి ఫలితం వచ్చింది.

అంగన్‌వాడీ పర్యవేక్షకురాలి డిప్యుటేషన్ రద్దు

ఎడపల్లి, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని ఎడపల్లి సెక్టార్‌కు డిప్యూటేషన్‌పై వచ్చిన పర్యవేక్షకురాలు విజయరాణి డిప్యుటేషన్ రద్దు చేసినట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని రసూల్‌బీ తెలిపారు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో డిప్యుటేషన్ రద్దు చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెలితే ఎడపల్లి మండల కేంద్రంలోని 3వ నంబరు అంగన్ వాడీ కేంద్రం నుంచి గత పది రోజుల క్రితం బియ్యం, పాలు, బాలామృతంను కొందరు బయట వ్యక్తులు అక్రమంగా తరలిస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించడంతో పోలీసులు దర్యాప్తు జరిపి అంగన్‌వాడీ టీచర్, ఆయమ్మ, అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ సీడీపీఓ పద్మ విచారణకు ఆదేశించడంతో బోధన్ డివిజన్‌కు చెందిన పర్యవేక్షకురాల్లతో విచారణ చేపట్టగా అక్రమంగా బియ్యం, పాలు, బాలామృతం తరలించడం నిజమే అని తేలడంతో అంగన్‌వాడీ పర్యవేక్షకురాలి డిప్యుటేషన్ రద్దుచేస్తూ అంగన్‌వాడీ టీచర్, ఆయమ్మలకు షోకాజ్ నోటీసులు అందించినట్లు సీడీపీఓ పద్మ తెలిపారు. తదుపరి చర్యలకు విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదించి కేంద్రంలో పిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని అక్రమంగా తరలించిన వ్యక్తులపైచర్యలుతీసుకునేలా చూస్తామన్నారు.

శభాష్ పోలీస్

● రోడ్డుపై గుంతలను పూడ్చిన రక్షక భటులు

ఎడపల్లి, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిలోని ఎడపల్లి రైల్వే గేటు వద్ద ప్రమాదకరంగా ఏర్పడ్డ గుంతలను మంగళ వారం ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తన సిబ్బందితో పూడ్చి వేయించారు. దీంతో వాహ నదారులు, గ్రామస్థులు ఎస్సై రమకు కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్డుపై గుంతలను పూడ్చే పనులు చేయిస్తున్న ఎస్సై రమ

అధికారులు సమయపాలన పాటించాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి



ఇసన్నపల్లిలో పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

దోమకొండ (బీబీపేట), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటించాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అధికారులను సూచించారు. దోమకొండ, బీబీపేట మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రభుత్వశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు సక్రమంగా ప్రజలకు సేవలను అందించాలని, విధినిర్వహణలో సమయపాలన తప్పకుండా పాటించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా అధికారులు ఎవరైనా ప్రవర్తిస్తే వారిపట్ల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

భిక్కనూరు: మండలంలోని బాగిర్తిపల్లి, ఇసన్నపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని పాఠశాలల పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయుల, విద్యార్థుల, మధ్యాహ్న భోజన రికార్డులను పరిశీలించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఆయాపాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు రావు.. జీపీల్లో అభివృద్ధి జరగదు!

- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- అస్తవ్యస్తంగా మురుగు కాల్వలు
- నిధుల్లేక అవస్థలు పడుతున్న జీపీ సిబ్బంది

మహమ్మద్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు నిధులు కరువయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన గ్రాంట్లు రాకపోవడంతో అభివృద్ధి పరిపాలన కుంటుపడుతోంది. స్థానికంగావచ్చే పనుల ఆధారంగానే సిబ్బంది జీతభత్యాలు చెల్లిస్తున్నారు. అత్యవసర పనులకు పంచాయతీలో రూపాయి లేక వాటిని ఎలా ఖర్చు చేసేదని గ్రామ పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. తాగునీటి ఎద్దడి నివారణ మరమ్మతు పనులకు మిషన్‌భగీరథ నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీల పైనే భారం పడుతోంది. దీంతో కొన్నిచోట్ల అత్యవసర పనులకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు సొంతంగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. సొంత డబ్బులు ఖర్చు చేసి పనులు చేసిన వాటి బిల్లులు కూడా ఇప్పటివరకు రాకపోవడంతో గ్రామ కార్యదర్శులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాదిన్నర కాలం గడుస్తున్నా పంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండగా, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే స్టేట్ ఫైనాన్స్ నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీలలో కుంటుపడింది. ఇందుకు కారణం ఏడాదిన్నర కాలంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడమే కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి.



అధ్వానంగా ఉన్న మురికి కాల్వలు

ఏడాదిగా ప్రత్యే అధికారుల పాలన

గత ఏడాది జనవరిలోనే గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. మండల పరిషత్‌ల పదవీకాలం కూడా జూలైలో నే ముగిసింది. మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం సైతం ముగిసింది. అన్ని స్థానిక సంస్థల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పాలకవర్గాలు ఉన్నంత కాలమే కేంద్రప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. ఆ తర్వాత నుం చి నిధుల విడుదలను నిలిపివేసింది. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో మెదక్ ఎంపీ రఘునందన్ రావు 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలపై కేంద్రాన్ని ప్రశ్నించగా.. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎస్పీ సింగ్ భగీర స్పందించారు. చట్టబద్ధంగా ఎన్నికైన స్థానిక సంస్థలకే నిధులు విడుదల చేస్తామని, పంచాయతీలకు 2023-24కు 15వ ఆర్థిక సంఘం కేటాయించిన గ్రాంట్లు వాయిదా పడిందని స్పష్టం చేశారు. ఏడాదిన్నర కాలంగా పంచాయతీ ఎన్నికలు ఆ తర్వాత మండల, జిల్లా, జిల్లా పరిషత్ ఎన్నికలను నిర్వహించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, ఏడాదిన్నర గడుస్తున్నా పాలకవర్గాలు చేసిన అభివృద్ధి పనులకు పెట్టిన డబ్బులకు బిల్లులు రాక గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులుకు గురవుతు న్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని, కుంటుపడుతున్న గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజాప్రతినిధులు ఉండాలంటే ప్రజాప్రతినిధులు ఉండాలని ప్రజలు, గ్రామపంచాయతీ అధికారులు కోరుతున్నారు.

ప్రతీ మహిళను సంఘంలో చేర్పించాలి

- డీపీఎం సాయిలు

మద్నూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మహిళను సంఘంలో చేర్పించాలని డీపీఎం సాయిలు అన్నారు. మండల కేంద్రం లోని మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘం అసిస్టెంట్లు, గ్రామ సంఘం అధ్యక్షులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం సాయిలు మాట్లాడుతూ మండలంలో ఉన్న పేద, నిరుపేద కుటుంబాలలో ఉన్న సంఘంలో లేని వారిని ఇంటింటి సర్వే ద్వారా గుర్తించి, వారిని మహిళా సంఘాల్లో చేర్పించాలని సూచించారు. 60 ఏళ్లు నిండిన వృద్ధ మహిళలను గుర్తించి వారిని వృద్ధసంఘాలుగా ఏర్పాటుచేయడం, దివ్యాంగులను గుర్తించి వారిని వికలాంగుల సంఘాలుగా తయారు చేయడం, కిశోర బాలికలను గుర్తించి వారిని కూడా సంఘాలుగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన సంఘాలకు బ్యాంకు ఖాతా ఓపెన్ చేయడంతో పాటు వారికి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు, అవకాశాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అంది వచ్చినా అవకాశాలను ఉపయోగించుకోవాలని కోరారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను వివిధ ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించుకోవాలని అదనపు ఆదాయం పెంపొందించు కోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం జగదీష్ ఆయా గ్రామ సంఘాల నుంచి వచ్చిన గ్రామ సంఘం అసిస్టెంట్లు, గ్రామ సంఘ అధ్యక్షులు మండల సమాఖ్య అధ్యక్షురాలు రేణుక సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.



మద్నూర్ మహిళా సమైక్య సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం

రైతులంతా ఐక్యంగా ఉండాలి

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న రైతులంతా ఐక్యంగా ఉండి తమ సమస్యలను తామే పరిష్కరించుకుందామని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో నిర్వహించిన రైతు సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత తరుణంలో రైతులకు అనేక సమస్యలున్నాయని, వాటిని రైతులు ఐక్యంగా ఉండి పరిష్కరించుకుందామని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం భారతీయ కిసాన్‌సంఘ్ ముందుండి పోరాటం చేస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా చూస్తే ఏ రంగం వారికైనా సంఘాలు ఉన్నాయని, అవి వారి సమస్యల కోసం పోరాటం చేస్తున్నాయనే విషయం గుర్తుకు చేశారు. సీజన్ వారిగీ తీసుకుంటే విత్తనం వేసే కాలం మొదలుకుని పంట చేతికి వచ్చేవరకు అనేక సమస్యలుంటాయని, వాటిని సంఘంగా ఉండి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు తమ పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు పాడయితే వాహనాలు మాట్లాడుకుని వాటిని మరమ్మతులకు తరలిస్తుంటారని, అలా కాకుండా 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేస్తే వారేవచ్చి రిపేర్ చేసుకొస్తారని తెలిపారు. కార్యక్రమంలో బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్ సీనియర్ నాయకులు హనుమంత్‌రావ్, తానాజీ, మహేందర్, కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీంగా మండల కమిటీ ఎన్నిక

మండల భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బస్వరాజ్ దేశాయ్, ఉపాధ్యక్షుడిగా జైత్రాం, గీరప్ప, కార్యదర్శిగా బోడ రాజు, సహాయ కార్యదర్శిగా మల్లిఖార్జున్, రంజిత్, సభ్యులుగా గురుదాస్, గోపాల్ సింగ్, జైపాల్, అంజయ్య, రాజులను ఎన్నుకున్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలుచేయాలని ఆందోళన



ఐలాపూర్‌లో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నందిపేట, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోస పథకం అమలు హామీని వెంటనే అమలు చేయాలని మంగళవారం నందిపేట మండలంలోని ఐలాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఏదుట ఆందోళన చేపట్టారు. వ్యవసాయ కార్మికులకు రూ.12వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే పథకం అమలు పై ప్రకటన చేయాలని అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకు లు గంగాధర్ ఐలాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దశరత్, కిషన్, ప్రకాష్, విఠల్, నషీర్ బాయ్, నవీన్, మల్లయ్య, సుమన్ తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులు పూర్తయ్యేదెన్నడో?

- దోంచంద నుంచి తడపాకల్‌కు నిలిచిన బీటీ రోడ్డు పనులు
- రేండేళ్లు కావస్తున్నా పూర్తి కాని పనులు

ఏర్గట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోంచంద నుంచి తడపాకల్ వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభమై రెండేళ్లు కావస్తున్నా నేటికీ పనులు పూర్తి కావడం లేదు. పనులు పూర్తయితే రాకపోకలకు ఇబ్బందులు తప్పుతాయని ఆ ప్రాంత రైతులు, ప్రయాణికులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు వేముల ప్రశాంత్ రెడ్డి దోంచంద నుంచి తడపాకల్ వరకు 3కిలోమీటర్ల 700 మీటర్ల వరకు ఎస్‌సీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి రూ.3 కోట్ల 92 లక్షలు మంజూరు చేయించారు. శంకుస్థాపన చేసి పనులు సైతం ప్రారంభించారు. అయితే పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా మట్టి వేసి దానిపై కంకర వేసి అక్కడక్కడ కల్లర్టులు నిర్మాణాలు చేసి చేతులు దులుపుకోవడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. అయితే దోంచంద తడపాకల్ గ్రామాలకు చెందిన రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు రోడ్డు పడిందని ఆశతో ఉన్న వారికి నిరాశే ఎదురైంది. రోడ్డు నిర్మాణంలో భాగంగా వేసిన కంకర రోడ్డుపై తమ వ్యవసాయా క్షేత్రాలకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు వాహనదారులు కోరుతున్నారు.

దోంచంద తడపాకల్ గ్రామాల మధ్య మట్టి, కంకర వేసిన రోడ్డు



16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

భిక్కనూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని జంగంపల్లి శ్రీ బ్రహ్మజ్ఞాన ఆశ్రమం కృష్ణ మందిరంలో ఈ నెల 16న శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని బ్రహ్మజ్ఞాన ట్రస్ట్ చైర్మన్ రంగు హన్మాగౌడ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో బాగంగా ధ్వజారోహణం, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనము, శ్రీ కృష్ణ భగవానుడికి విశేషా మహాభిషేకం, లక్షా పుష్పార్చన, స్వామివారికి 56రకాల స్వీట్స్‌తో (చెప్పను భోగ్) స్వామివారికి నివేదన, మహా అన్నదాన ప్రసాదం, డోలారోహణం, ఉట్టి కొట్టుట, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవవంతం చేయాలని కోరారు.

దోమకొండలో కానిస్టేబుల్ సస్పెన్షన్

దోమకొండ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దోమకొండ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న విశ్వనాథ్ అనే కానిస్టేబుల్ సక్రమంగా విధులు నిర్వహించకుండా, విధుల పట్ల అలసత్వం వహిస్తూ ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించి ఆయనను ఎస్పీ రాజేష్‌చంద్ర మంగళవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాన్సువాడ రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ మరమత్తు పనులు చేయనున్నట్లు రూరల్ ఏఈ అనీల్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపేట్, బోర్లం, బోర్లాం క్యాంప్, పోచారం, చిన్న రాంపూర్, ఇబ్రహీంపేట్ తాండా గ్రామాల్లో ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, రైతులు, ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

నేడే రైతు బీమా దరఖాస్తుకు చివరి అవకాశం

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జూన్ 5తారీఖు లోపు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన ఎల్లారెడ్డి మండలంలోని రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎల్లారెడ్డి మండల వ్యవసాయాధికారి నదిముద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులు ఆగస్టు 13 సాయంత్రంలోగా 18 సంవత్సరాల నుంచి 58 సంవత్సరాల వయస్సు కలిగిన పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లను జత చేసి వ్యవసాయాధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



భిక్కనూరులో శిక్షణ ఇస్తున్న దృశ్యం

15 సంవత్సరాలు పైబడిన వారిని
అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం

భిక్కనూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాసులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని భిక్కనూరు ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, కోర్స్ డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి, జయరాం అన్నారు. మంగళవారం భిక్కనూరు బాలికల ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్నిగ్రామాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, వీవోఏలకు శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వీవోఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాద్

కొత్త సంఘాల ఏర్పాటుపై దృష్టి సారించాలి

సదాశివనగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఐకేపీ ఆధ్వర్యంలో సీసీలు, సీఏలు. మహిళా సంఘాల అధ్యక్షులు కొత్తసంఘాల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఏపీఎం ప్రసాద్ అన్నారు. మంగళవారం సదాశివనగర్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో వీవోఏ, వీవో అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వద్ధ, కిషోర బాలికల సంఘాల ఏర్పాటుపై దృష్టి సారించి ఎక్కువ సంఘాల ఏర్పాటు అయ్యేలా కృషి చేయాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు పుస్తకాల నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, సీఏలు పాల్గొన్నారు.



ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

గాంధారిలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం

గాంధారి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలో కామారెడ్డి-బాన్సువాడ రహదారిపై ఎల్లారెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సర్దార్ నాయక్ ఆధ్వర్యంలో నెహ్రూ విగ్రహం ఎదుట ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సర్దార్ నాయక్ మాట్లాడుతూ నరేంద్రమోదీ దొంగ ఓట్లు వేయించుకుని ప్రధాని కావడం జరిగిందన్నారు. రాహుల్‌గాంధీని రాజ్యాంగానికి వ్యతిరేకంగా అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. దానికి నిరసనగా ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేశామన్నారు. కేంద్రం బీసీ రిజర్వేషన్లు ఆమోదించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భరత్‌రెడ్డి, నాయకులు సంజీవ్, బాలయ్య, రమేష్, మోతిరాం, నీల రవి, శంకర్, నితిన్, బామన్ సురేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో
ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు

మద్నూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలోని ఆంగ్ల మీడియంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ గంగాకిషోర్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆగస్టు 13వ తేది ఉదయం 9 గంటల నుంచి నేరుగా కళాశాలకు హాజరు కావాలని, అలాగే అన్ని రకాల అసలు ధ్రువపత్రాలతో రావాలని సూచించారు.

రాజ్యాంగ సంస్థలపై ఆరోపణలు విడ్డూరం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్న రాజులు

కామారెడ్డిటౌన్,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సంస్థలపై రాహుల్‌గాంధీ సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేయడం విడ్డూరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశప్రయోజనాలే లక్ష్యంగా,ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న బీజేపీ గత మూడు పార్లమెంట్ ఎన్నికలలో సగానికిపైగా రాష్ట్రాలలో ప్రజల మన్ననలు పొందిందని తెలిపారు. కులాల,మతాల వారిగా చిచ్చుపెడుతూ ఎప్పటికప్పుడూ ప్రజల చీత్కారాలకు గురవుతూ ప్రజల నాడి తెలుసుకోకుండా ఈవీఎంలను, ఎన్నికల సంఘాలను తప్పుపట్టడం కాంగ్రెస్ నాయకుల అసమర్థతను తెలియజేస్తుందని అన్నారు.నరేంద్రమోదీ సారథ్యంలో బీజేపీకి రాష్ట్రాలలో ఆదరణ పెరుగుతుండడంతో రాహుల్‌గాంధీ, ఇండియా కుటమి పార్టీలు ఏమిచేయాలో తెలియక ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. మరి కర్ణాటక, తెలంగాణలో గెలిచిన కాంగ్రెస్ పార్టీలు ఈవీఎంల పనితీరుపై ఎందుకు మాట్లాడడం లేదని అన్నారు. గెలిస్తే మా విజయం, ఓడితే ఈవీఎంలు, ఎన్నికల సంఘం పని అనిసిగ్గుమాలిన మాటలు మాట్లాడడం కాంగ్రెస్‌నాయకులకే చెల్లిందని అన్నారు. ఎలాంటి అనుమానాలు ఉన్న లిఖిత పూర్వకంగా రాసి ఇస్తే చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం స్పష్టం చేసినప్పటికి కావాలనే ఆరోపిస్తు ప్రజలను, మీడియాను తప్పుదోవపట్టిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలోబీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, బీజేవైయం జిల్లా అధ్యక్షుడు వేణు, నాయకులు సురేష్, సంతోష్‌రెడ్డి,రవీందర్,రాజేష్,రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్యను పరిష్కరించండి



విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం పరిధిలోని రెండవ వార్డు పరిధిలో తలెత్తిన లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో వికేవి ఫంక్షన్ హాల్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెండవ వార్డు తరఫున విద్యుత్ శాఖ ఇంచార్జి ఏడి ప్రసాద్ రెడ్డి, ఏఈ వెంకటస్వామిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండవ వార్డు పరిధిలో విద్యుత్ వినియోగం పెరగడంతో అక్కడలో ఓల్టేజీ సమస్య బాగా పెరిందని, దీంతో ఇళ్లలోని విద్యుత్ ఉపకరణాలు కొన్ని కాలిపోతుండగా, మరి కొన్ని అసలు పనిచేయడం లేదని స్థానికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇకపై నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లో వోల్టేజ్ సమస్యను వారం లోగా పరిష్కరిస్తామని విద్యుత్ అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహేష్, నరేష్, ప్రవీణ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమా దరఖాస్తుల పరిశీలన

మద్నూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతుబీమా దరఖాస్తులను మండల వ్యవసాయ అధికారి రాజు, సిబ్బంది పరిశీలించారు. మండల రైతులు రైతు బీమా ఇప్పటి వరకు చేసుకుని వారు అలాగే, కొత్తగా పట్టా అనగా 2025 జూన్ 5వ తేది వరకు పట్టా పాస్ బుక్ ఉన్న రైతులు 18నుంచి 59 ఆధార్ కార్డులో 1966 ఆగస్టు 14న, 2007 ఆగస్టు 14వ తేది మధ్య పుట్టిన రైతులు రైతు భీమా పథకంకు అర్హులు అని దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 13న బుధవారం సాయంత్రం 5 గంటల వరకు అర్హులైన రైతులు స్వయంగా వెళ్లి గ్రామ వ్యవసాయ విస్తీర్ణ అధికారి వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంతకు ముందు భీమా చేసుకున్న రైతులు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈవో సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తోట

మద్నూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుల్తాన్ పేట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహిన్ పటేల్ (75) అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతారావు కాంగ్రెస్ సీనియర్ నాయకుని అంత్యక్రియలు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

రాజంపేట,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):రాజంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో మంగళవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈవో పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ వయోజన విద్యాశాఖ ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత ప్రతి గ్రామంలో వాలంటర్లపైన ఉందని తెలిపారు. 12 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వారిని 100శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈశ్వరయ్య, ఆర్‌పీలు స్వామి, శ్రీధర్‌గౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల సంఘాల ఏర్పాటుపై శిక్షణ

రాజంపేట,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలో మంగళవారం ఐకేపీ కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో సామాజిక చేకూర్పు నూతన స్వయం సహకార సంఘాలు ఏర్పాటుచేసినట్లు ఆడిట్ డీఎంజీలు రామచంద్రగౌడ్, సంగమేశ్వర్‌లు తెలిపారు. విభిన్న ప్రతిభవంతుల సంఘాలు, కిశోరబాలికల సంఘాల ఏర్పాటుపైన శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేయడం జరిగిందని ఈ శిక్షణ కార్యక్రమంలో 20 గ్రామసంఘాల అధ్యక్షులు హాజరయ్యారని తెలిపారు. 18 సంవత్సరాల పైబడిన మహిళలను సంఘాల్లో చేర్పించడం, 60 సంవత్సపరాలు నిండిన వృద్ధ మహిళలను వృద్ధుల సంఘాలు ఏర్పాటుచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షులు లక్ష్మీ,లావణ్య, ఏపీఎం రాజిరెడ్డి,సీసీలుభాగయ్య, సాయిలు,శ్రీనివాస్, స్వామి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

రాజంపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని బస్వన్నపల్లి గ్రామానికి చెందిన ఏనుగురాజిరెడ్డి సంబంధించిన రెండెకరాల మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేయడంతో మంగళవారం ఏవో శృతి పరిశీలించారు.రైతుల పంటలు ధ్వంసం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఫారెస్ట్ అధికారులను కోరుతామన్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వ సాయం అందేలా ప్రభుత్వానికి రిఫర్ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈవో అఖిల, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల హాజరు పకడ్బందీగా తీసుకోవాలి

తాడ్వాయి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీలో పని చేస్తున్న కూలీల ఆధారాలను పకడ్బందీగా తీసుకోవాలని ఏపీవో కృష్ణగౌడ్ అన్నారు. ఈయన మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశంలో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి కూలీలకు తగిన పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. హాజరు పట్టిక పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. సకాలంలో హాజరు పట్టికలను కార్యాలయంలో అందించాలని అన్నారు. ఇందులో టెక్నికల్ అసిస్టెంట్ స్వామి, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.



తాడ్వాయిలో మాట్లాడుతున్న ఎంఈవో రామస్వామి

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

తాడ్వాయి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని నిరక్షరాస్యులైన యువతి, యువకులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ రామస్వామి తెలిపారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం నవభారత్ సాక్షర కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులైన వయోజకులను, యువతులను గుర్తించి వారికి అక్షరాలు నేర్పించాలని సూచించారు. గ్రామాల్లోని కూడళ్ల వద్ద లేదా కమ్యూనిటీ హాల్‌లలో వారికి విద్యాభ్యాసం నేర్పించాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు చదవటం రాయటం నేర్చుకోవాలని కోరారు. నిరక్షరాస్యతను రూపుమాపడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమం 2022 నుంచి 2027 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం రాజు, ఆర్పీలు సంగాగౌడ్, ప్రవీణ్ గ్రామాల మహిళా ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతివేడుకలను మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

సమాచార అధికారిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



అయోధ్యరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార కమీషనర్ అయోధ్యరెడ్డిని మంగళవారం కలెక్టరేట్‌లో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై జిల్లా అధికారుతో అవగాహన కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై సమీక్షించేందుకు వచ్చిన అయోధ్యరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు గోనె శ్రీనివాస్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీలకే ఆధిపత్యం

(5వ పేజీ తరువాయి)

ఎన్నికలంటే ముందు పరిషత్ ఎన్నికలు వస్తాయని తెలుస్తోంది.

రిజర్వేషన్లపై కొనసాగుతున్న సందిగ్ధత

రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. ఈ ఆర్డినెన్స్‌పై గవర్నర్, రాష్ట్రపతి, కేంద్రం నుంచి ఎలాంటి ఆమోదం పొందకపోవడంతో సందిగ్ధత కొనసాగుతునే ఉంది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తోంది. రిజర్వేషన్‌లు అమలు అయితే ముందుగా జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రక్రియ పూర్తి చేసి తర్వాత పంచాయతీలకు రిజర్వేషన్‌లు ఖరారు చేస్తారని భావిస్తున్నారు. 42 శాతం బీసీలకు, 15 శాతం ఎస్సీలకు, 7 శాతం ఎస్టీలతో పాటు అన్ని కేటగిరీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు స్థానిక ఎన్నికల్లో అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇది వరకే ఆర్డినెన్స్ జారీ చేసింది. జిల్లా పరిషత్ చైర్మన్‌లకు రాష్ట్ర యూనిట్‌గా, ఎంపీపీ పదవులకు జిల్లా యూనిట్‌గా ఎంపీటీసీ, సర్పంచ్‌లకు మండల యూనిట్‌గా, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు గ్రామ యూనిట్‌గా రిజర్వేషన్‌లు నియమించవచ్చని తెలుస్తోంది. రిజర్వేషన్‌లు ఖరారు అయితే సెప్టెంబరులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.



పోచారం శివారులో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

భూముల జాయింట్ సర్వే

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచారం గ్రామంలో మంగళవారం రెవెన్యూ, అటవీ శాఖలకు చెందిన అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆర్ఐ అంజయ్య మాట్లాడుతు గతంలో ఆయా గ్రామాలలో నిర్వహించిన భూభారతి గ్రామ సభలలో ప్రజలు దరఖాస్తు చేసుకోగా వాటిని నేడు రెవిన్యూ, అటవీ శాఖ ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించడం జరిగిందని తెలిపారు. పోచారం గ్రామంలో సర్వే నెంబర్ 51 లో మొఖపైకి వెళ్లి సర్వే నిర్వహించామని ఈ నివే దికను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ వెంకన్న, డిఆర్‌వో అభిలాష్. మాజీ సర్పంచ్ మదన్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే తోట

కాంగ్రెస్ పార్టీలో చేరిక

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠల్‌వాడీ తాండకు చెందిన పవార్ చందర్, గంగారాం వారి కుటుంబ సభ్యులు మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న వీరు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరారన్నారు. వీరికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కారక్రమంలో నాయకులు జాగూర్ నాయక్, బన్సీ రమేష్ బాబు, శంకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



సుల్తాన్‌నగర్‌లో ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సుల్తాన్‌నగర్‌లో ఇంటింటా మొక్కల పంపిణీ

నిజాంసాగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హరితహారం పథకంలో భాగంగా మండలంలోని సుల్తాన్ నగర్ గ్రామంలో మంగళవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటా పూల మొక్కలతో పాటు పచ్చని మొక్కలను పంపిణీ చేశారు. గ్రామంలో 192 కుటుంబాలకు ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయడం జరిగిందని కార్యదర్శి రవి రాథోడ్ తెలిపారు. గ్రామ పురవీధుల గుండా గ్రామ పంచాయతీ సిబ్బంది మొక్కలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

అల్బెండాజోల్ మాత్రలతో నులి పురుగుల నివారణ

మద్నూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులి పురుగుల మాసోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆల్బెంబజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యంఎల్‌హెచ్ బస్వరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎల్లప్పుడూ పరిశుభ్రతను పాటించాలని, ఆరోగ్యపరమైన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. ఆరోగ్య సూత్రాలను విద్యార్థులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగా కిషోర్, ఉపసంక్షేమాధికారి నరహరి ప్రసాద్, గ్రంథాలయం పరిశీలకులు వేణుగోపాల్, రాము, వ్యాయామ ఉపాధ్యాయులు -జె గణేశ్, నాగరాజు, ఉపన్యాసకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

23న ఎల్లారెడ్డికి మందకృష్ణ రాక

● వికలాంగుల చేయూత పెన్షన్‌దారులంతా తరలి రావాలి

ఎల్లారెడ్డి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న ఎల్లారెడ్డికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పెంచిన పెన్షన్ సాధనకై సన్నాక సదస్సు ఉంటుందని జిల్లా అధ్యక్షుడు మంథని సామిల్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగులకు రూ ఆరు వేలు, ఇతర చేయూత పెన్షన్ నాలుగు వేలు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచిన ఇచ్చిన హామీని అమలు చేయకుండా మోసం చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని ఇక ప్రజల్లో ఎండగడతామని పెన్షన్ దారుల అందరికీ అండగా నిలబడతామని తెలియజేశారు. ఈ సదస్సుకు అందరూ పెన్షన్ దారులు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శివానందం, కంతి పద్మారావు, గంగారం వెళ్ళ బాబు, శ్రీను, నాగరాజు, సైదులు, సంగయ్య పోలు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

తాడ్వాయి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు మంజూరు చేసిన నూతన రేషన్ కార్డులను మంగళవారం పంపిణీ చేసినట్లు తహసీల్దార్ శ్వేత తెలిపారు. మండలానికి మొత్తం 2869 కొత్త రేషన్ కార్డులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో 2219 యాడింగ్ 750 కొత్త రేషన్ కార్డులు వచ్చినట్లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో 329 రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఇందులో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్యామ్‌రావు తదితరులు ఉన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్	అతడు
ప్రియా 70	హరిహర వీరమల్లు
ప్రియా 35	మహావతర్ నరసింహ

బాన్సువాడ

మహేశ్వరి	కింగ్‌డమ్
వెంకటేశ్వర	మహావతార్ నరసింహా



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	140	170
వెన్‌కాబ్(కిలో)	130	160	190

